# ఆశాభంగం

రచన :
శ్రీమతి పతానేని శ్రీశైల భ్రమరాంబ

ఆఫీసునుంచి హడావిడిగా ఇంటికొచ్చి కోటు కూడా విప్పకుండా రాధా! రాధా! అంటూ గొంతెత్తి పిల్చాడు కృష్ణ.

రాధ పలక్కపోయినా రవి పరుగెత్తుకువచ్చి 'తెల్లీ! నాన్నాలొచ్చాలాయ్!' అంటూ దూరంగావున్న లీలని పిల్చాడు గంతులేస్తూ.

'రవీ! అమ్మ ఎక్కడుందో తొందరగా వెళ్ళి తీసుకురా' అన్నాడు.

'నా పొత్తలం ఏది?' అన్నాడు రవి.

'అమ్మని త్వరగా తీసుకొస్తే ఇస్తా' అన్నాడు కృష్ణ.

'ఏమిటో అంత అర్జంటు' అంది దొడ్డివరండా మీద నుంచే రాధ.

'అక్కడుండే నేను కంఠం చించుకొన్నా పలకలేదన్నమాట! నీతో ఓ మాట చెప్పాలి. అత్యవసరం. త్వరగారా!' అన్నాడు సీరియస్‌గా.

'ఇప్పుడు చెయ్యి ఊరుకోలేదండీ! చంటిదానికి అన్నంపెడ్తున్నా అంత అగత్యవసరమైనమాటైతే ఇక్కడికొచ్చి చెప్పండి' అంది.

'అక్కడికొచ్చి చెప్పడానికి వీల్లేదు - నువ్వేఇల్లా రా- దానికి ఇక్కడ కూర్చోబెట్టి అన్నం తినిపించొచ్చులే'

'బాగుందండీ మీ మాటలు మీరూను? అక్కడ హాల్లో మెతుకులు చిమ్మి నీళ్లు ఒలకబోస్తే అదంతా బాగుచెయ్యడం ఇంకోపనాఏమిటి నాకు? వీళ్ళతో గంటనుంచి కొట్టుమిట్లాడి ఛస్తోంటే'

'గవర్నరుకైనా ఖాళీవుంటుంది కాని నీకుమాత్రం జన్మలో తీరుబడి వున్నట్లే కన్పించదు. సరిగ్గా నేనింటి కొచ్చేవేళకే ఆ వెధవకి భోజనంటైమ్ అనుకొంటా... కాస్త తొందరగా తెముల్చుకొని ఇల్లారా - నీతో ఓ మాట చెప్పాలి.' అంటూ సిరియస్‌గా అనేసి బట్టలు మార్చుకోవడం ప్రారంభించాడు కృష్ణ.

చంటిదానికి చేతులు మూతి కడిగి శుభ్రంగా గౌను తొడిగి చంకనిబెట్టుకువచ్చి వయ్యారంగా భర్తప్రక్కని నిల్చుంది రాధ - రవి, లీలవచ్చి తల్లికి చెరో ప్రక్క నిల్చుని 'అమ్మా! నాన్న పొత్తలం ఇవ్వలేదే' అంటూ సీరియస్‌గా ఫిర్యాదు చేశాడు.

'రాధా! నేను నిన్నొక్కర్తెనే రమ్మన్నాను కాని వీళ్ల ముగ్గుర్నీ కాదు. వీళ్ళని కాస్సేపు దూరంగా కూర్చోబెట్టి నువ్వొచ్చి ఇక్కడ కూర్చో. నీతో ఓ అత్యవసర విషయాన్ని గురించి మాట్లాడాలి.'

'ఏమిటి స్వామీ! అంత అత్యంత రహస్యమైన మాట?' అంది నవ్వులాటగా ఎగతాళిచేస్తూ రాధ.

'ఏయ్! అన్నింటికీ హాస్యధోరణిపనికిరాదు. తెలుసా? "రవీ కాస్సేపు చెల్లాయిల్ని తీసుకు అల్లావెళ్లి ఆడుకో బాబూ!' అన్నాడు మెల్లిగా కృష్ణ.

'వాళ్ళకి మీరుతెచ్చిన పొట్లం ఏదో చేతికిచ్చేస్తే వాళ్ళే వెడ్తారు' అంది నవ్వుతూ చూస్తూ.

'పొట్లంలేదు; గిట్లంలేదు; పొమ్మను వెధవల్ని - పీక మొయ్యా మింగినవాళ్ళకి ఇంకా పొట్లం కావాలేం? వెళ్లు - అల్లాపోయి ఆడుకోండి.' అన్నాడు కొంచెం కసురుతూ కృష్ణ.

'బలే బాగుందండీ! రోజూ ఇంటికి రాగానే ఏదో తెచ్చిపెట్టే అలవాటు ఇవ్వాళ ఒద్దంటే ఎక్కడికి పోతుంది!'

'మానుకోవాలి - లేకపోతే నువ్వు మానిపించాలి - అంతేకాని రోజూ వీళ్లకోసం ఇదో అదనపు ఖర్చా?'

'అసలు మీరు ఏమైనా తెచ్చారా? లేదా? అది చెప్పండిచాలు'

'నేనేమీ తేలేదు - ఇకముందునుంచీ తేదల్చుకోలేదు' నిక్కచ్చిగా చెప్పాడు కృష్ణ.

'ఆమాట ముందేచెప్తే ఒదిలిపోయేదానికి అమ్మ వచ్చాక ఇస్తాననడం ఎందుకు? పిల్లలు వాళ్లూరుకొంటారా?' అంటూ వంటింట్లోకివెళ్ళి అలమార్లోంచి మూడు బిస్కట్లు తెచ్చి ముగ్గురికీ ఇచ్చి వీధిలోకి పంపించింది రాధ. వచ్చి భర్తముందు కూర్చుంది.

'రాధా!మనింట్లో దూబారాఖర్చుఎక్కువైపోతోంది. నాకంటే తక్కువ జీతగాడుకూడా కొద్దోగొప్పో నిలవేసుకోగల్గుతున్నాడు కాని నేనుమాత్రం...'

'బాగుందండీ మీ మాటలూ మీరూను. ఊ ఏవరికీ దానధర్మాలు చెయ్యడంలేదు - ఊడకబోసి పారెయ్యడంలేదు. మనింట్లో దూబారా ఏముంది?' అంది సీరియస్‌గా రాధ.

'కాస్త స్థిమితంగా కూర్చొని నేనడిగినదానికీ సరిగ్గా సమాధానం చెప్పు?' అన్నాడు.

'చిత్తమండి ఆఫీసరుగారూ!'

'రాధా! ఇప్పటికి మనం పెద్దవాళ్లు ఇద్దరం, పిల్లలు ముగ్గురు. అయిదుగురవలేదా! ఇంకో అయిదు నెలల్లో మరో మెంబరు - అప్పుడు ఆరుగురం అవుతాంకదూ?'

రాధ చిరునవ్వుతో భర్తముఖంలోకి చూచింది.

'ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలు. ఇంకపుట్టబోయేది ఆడో; మగో ఇంకా తెలియదుకదా!'

'ఇవా మహాత్మా! తమ రాచకార్య విషయాలు?'

'అదుగో! తిన్నగా అల్లా కూర్చో - నేను చెప్పింది శ్రద్ధగా విను.'

అంతలో పువ్వులమ్మే ఆమెవస్తే వీధులోకి వెళ్ళి మల్లెమొగ్గలు, నాల్గు గులాబీపూలు ఓ పళ్లెంలో పోయించుకు ఇంట్లోకి వచ్చింది రాధ.

'చూడు రాధా! ప్రతీరోజూ పువ్వులకోసం ఎందుకింత దండగచేస్తావ్? నువ్వొక్కర్తెవూ పెట్టుకొంటే చాలదూ? సాయంత్రం ఆరుగంటలవుతోంటే ఇప్పుడింకా పిల్లలకికూడా ఎందుకు కొనడం?'

'బాగుంది. నేనొక్కర్తెనూ పెట్టుకుంటే అది ఊరుకొంటుందా చెప్పండి. లీల లీలలు మీకుమాత్రం తెలీవూ?'

'అటువంటప్పుడు ఏవో కొంచెం కొనుక్కొని ఊరుకోవాలి. ప్రతీరోజూ ప్రతీదీ నువ్విల్లాగే అనవసరంగా దండగచేస్తున్నావు. మనం ఏదో కాస్త వెనకేసుకోవాలి; పొదుపుచేసుకోవాలి అని ఎన్నిసార్లు నేను మొత్తుకున్నా...'

'పోనీ రేపటినుంచి మానేస్తా! సరేనా?' అంది చిరుకోపంతో.

'రాధా! మనకిప్పటికి ఇద్దరు ఆడపిల్లలు ఓ మగల్లాపిడు. అవునా? పుట్టబోయేది ఆడపిల్లో, మగవాడో చెప్పలేకపోయినా; వీళ్లకి చదువులూ, పెళ్లిళ్లు, కట్నాలు అన్నీ కావాలికదా ఎప్పటికైనా.'

'ఎప్పటి సంగతో ఇప్పుడెందుకండీ?'

ఎప్పటికైనా అదంతా మననెత్తిమీదవున్న బరువే కదా! అందుకు ముఖ్యంగా డబ్బుండాలా?'

'అక్కర్లేదని నేనెప్పుడైనా అన్నానా మహానుభావా!'

'అందుకే నిన్నుచూస్తే నాకు అరికాలిమంట నెత్తికెక్కుతుంది. నేనెంతో సీరియస్‌గా ఆలోచించి గుండెలు చీల్చుకు మాట్లాడ్తూంటే నువ్వేమో పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రంలా వేళాకోళంగా అంటావేం?' చాలా స్ట్రాంగ్‌గా అన్నాడు కృష్ణ.

'ఆహా! అంతా వింటాను. గుండెలు పగిలే పిడుగుల్లాంటి మాటలేవో తేల్చెయ్యండి హుజూర్!' అంది సన్నంగా నవ్వుతూ రాధ.

కృష్ణ ఓ గంటసేపు పొదుపు ఉద్యమాన్ని గురించి పెద్ద కంఠస్వరం (లౌడుస్పీకరు లేకపోయినా అంత ధ్వని)తో చెప్పాడు. అంతా పూర్తయ్యాక ఎల్లావుంది? (నా ఉపన్యాసం) అనడిగి ఆయాసంతో కుర్చీకి జేర్లబడ్డాడు కృష్ణ.

'నా నెత్తిలా వుంది. అన్నింటిలోనూ పొదుపు చెయ్యాలంటే అడుక్కుతిన్నట్టుంటుంది సంసారం.' అంది రపీమని రాధ.

'రాధా! పొదుపు ఉద్యమాన్ని గురించి వేలాది ప్రజలు ఉపన్యాసాలిస్తున్నారు; ప్రభుత్వం కరపత్రాలు పంచిపెడ్తున్నాయి... కాని నీతోమాత్రం నేనెంత మొత్తుకుని చెప్పినా వినకుండా వున్నావ్. ఇవ్వాళ అసలు మన రాబడి; ఖర్చు; అంతా బడ్జెట్ వేసి నెలకెంత మిగల్చాలో తేల్చుకోవాలి. ఆ ఉద్యమానికి ఇవ్వాళే ప్రారంభ దినం. నువ్వు అందుకు అంగీకరించకపోతే మాత్రం...'

'నన్నుకూడా మా పుట్టింట వదిలేసి మీకొచ్చిన జీతం పొదుపుచేసుకొంటారా?' అంటూ రాధ విరగబడి నవ్వింది.

'ఏయే? రాధా! నీకసలు బుద్ధుందా లేదా? నేచెప్పి

నట్లు కాస్త సరిగ్గా విని, దానికి సరియైన జవాబిస్తావా? లేదా?' ఉస్సుమన్నాడు కృష్ణ.

మళ్లీ మాట్లాడకుండా తలవొంచుకు కూర్చుంది రాధ.

'ఈ వీధిని వున్న వారందరికంటే ఎవరికి జీతం ఎక్కువంటావ్?' కొశ్చన్‌మార్కు ముఖంపెట్టి అడిగాడు కృష్ణ.

'మీకే' అని ముక్తసరిగా జవాబిచ్చింది రాధ.

'నెలకు వందరూపాయల జీతగాళ్లుకూడా కొద్దో గొప్పో మిగల్చుకొంటున్నారు. కాని నెలకి నూటయాభై జీతం, యాభై టి. ఎ. కల్సి మొత్తం రెండువందలు వస్తోన్నా నెలాఖరయ్యేసరికి నయాపైసా మిగలడంలేదు. మన కుటుంబానికి నూటయాభై అయితే స్వేచ్ఛగా సరిపోతుందని నువ్వే ఎన్నోసార్లు అన్నావు నాతో. అటువంటప్పుడు ఓ యాభై అయినా వెనకేసుకోపోతే, భవిష్యత్‌లో పిల్లల చదువులు, ఓమంచీ, చెడ్డా, రోగం, రొష్టూ, వీట్లన్నింటికీ మనకి డబ్బెల్లా వస్తుంది? ఈ నెల నుంచీ మనకి యాభైరూపాయలు మిగలాల్సిందే! అందుకు నువ్వు లెఖ్ఖ చెప్పాలి-తెలుసా?'

ఆమాటతో రాధ చర్రున తారాజువ్వలా లేచింది. 'అదేమిటండీ? అనవసరంగా నన్నంటారు? మీ స్వంత ఖర్చులకి యాభైకాదుకదా ముప్పాతిక అవుతున్నాయి-తెలుసా? నేనేదో మింగేస్తూన్నట్లు మాట్లాడుతున్నారే కాని మీఅంత దూబరా ఎవరికీ లేదు. నూటపాతిక నాకివ్వండి. దాంతో నేను పొదుపుగా సంసారం చేస్తాను. మిగతా పాతికతో మీ కాఫీ హోటల్సు, కిళ్లీ, సిగరెట్లు, సినీమాలు అన్నీ సరిపెట్టుకోండి. యాభై నిక్షేపంలా మిగుల్తాయి-నా చేతికిచ్చిన డబ్బులోదిమాత్రం మీరు తన్నుకుపోవడానికి ఒక్క నయాపైసాకూడా రాదు. ఊ అనవసరంగా మీరు ఖర్చులు చేసుకోవడం నామీద కసురుకోవడం మీకు బాగా అలవాటైపోయింది' అంది రుసరుసలాడ్తూ రాధ.

'రాధా! ఇదుగో నేను వాగ్దానం చేస్తున్నాను. ఈ నెలనుంచి నేను యాభై నిలవచేసి ఒక్క పదేళ్లనాటికి ఆరువేల రూపాయలు బ్యాంకులో దాస్తాను-అల్లాకాక్కపోతే ఇన్సూరెన్సు కడ్తా...అంటూ భవిష్యత్ కార్యక్రమాన్ని గురించి పావుగంట లెక్చరిచ్చాడు కృష్ణ.

'ఎందుకొచ్చిన ప్రతాపాలు మహాశయా! తల్లి పుట్టింటిని గురించి మేనమామల దగ్గర పొగడ్తలెందుకు? ఇదంతా చెప్పడంవరకే గాని మీకు ఆచరణలో శూన్యం. చూస్తాంగా. ఈ నెలలో ఎంత వరకూ నిర్వాకం చేస్తారో?' అంది వెక్కిరిస్తూనట్లు రాధ.

ఈసారి నే నేదైనా అనవసరం ఖర్చు చేసినట్లుగాని, దూబరాగా...ఏమాత్రం నీకు తెల్సినా ఈ జన్మలో నామాట నమ్మవద్దు. సరేనా?' అంటూ భోజనానికి లేచాడు కృష్ణ. భోజనం చేసేటప్పుడు కూడా పొదుపును గురించి మళ్లీ ఓసారి రాధకి హెచ్చరించి బయటకి వచ్చాడు.

◆ ◆ ◆

పొదుపు ఉద్యమాన్ని అమలుపర్చడంలో కృష్ణ మాత్రం నానా యమయాతనలు పడ్తున్నాడు. అరగంటకోసారి అయ్యరు కాఫీ హోటల్లో అర్ధో పావలో అర్పిస్తేకాని ఆగలేని ఘటంతను. తను కాఫీ త్రాగే సమయంలో ఏ ఫ్రెండు అయినా వుంటే కాని తక్కువ లేకుండా (రూపాయి) కాగితం అర్పించి బయటపడ్తాడు. అటువంటి కృష్ణ పొదుపు చెయ్యడంలో తన రాధ చేత సెభాష్ అనిపించుకోవాలని ఇంట్టిదగ్గర నుంచే ఫ్లాస్కు, చిన్న టిఫిన్ కారియర్ కూడా తీసుకెడ్తున్నాడు. ఈ విధంగా డబ్బుయందు నిర్లక్ష్యం లేకుండా, హోటల్ కన్పించేసరికి కడుపులో రెపరెపలాడినా లెక్క చెయ్యకుండా, వీధులో అడుక్కు తినే బిచ్చవాళ్లని చూచినప్పుడు గుండె తరుక్కు పోతున్నా పర్సులోనుంచి పైసా కదపకుండా అన్నమాట నిలబెట్టుకోవాలని ఆశతో ఎంతో పట్టుదలగా నెలరోజులు సాధించుకు వచ్చాడు కృష్ణ.

జీతం రెండు వందలూ పర్సులో పెట్టుకు హుషారుగా ఇంటికి వస్తున్నాడు తన ప్రతాపాన్ని రాధతో చెప్పి ఘరానా మాట అన్పించుకోవాలని. సరిగ్గా యింటికి వచ్చాడు. అంతలో తన మిత్రుడు వాసు కన్పించి 'కృష్ణా!' అంటూ చిన్న పిల్లాడిలా వచ్చి తన భుజం మీద చేతులు వేసి ఆపేశాడు. వాసు ముఖంలోకి చూచాడు కృష్ణ. గ్రహణం పట్టబోయే ముందున్న సూర్యబింబంలా కళ కాంతులు లేకుండా కళ్లంట నీళ్లు రాబోతూ తల వొంచుకు నిల్చున్నాడు వాసు.

'అదేమోయ్ అల్లా వున్నావ్? పుట్టెడు దుఃఖంలో కూరుకుపోతున్నట్లు పెట్టావేమిటి ఆ పోజు?' అన్నాడు కొంచెం పరిహాసంగానే కృష్ణ.

'నీ కోసమే వస్తున్నా యిల్లారా.' అంటూ కృష్ణని చెయ్యి పట్టుకు ఆస్పత్రిలోకి తీసుకు వెళ్లి ఓ బెడ్ చూపించాడు. 'కృష్ణా! నా భార్య ప్రసవించి చాలా ప్రాణాపాయ స్థితిలో వుంది. వీళ్లు నల్గురూ నా తొలి భార్య సంతతి. ఈమెకు మొదటి కాన్పులోనే చాలా... ఒక్క యాభై రూపాయలుంటే నా ఇల్లు నిలుస్తుంది. నా భార్య జీవించి సుఖంగా వుంటే ఎప్పటికైనా నీ ఋణం తీర్చుకుంటా అంటూ కళ్లంట నీళ్లతో ఎంతో దీనంగా అడిగాడు వాసు.

వాసు కుటుంబాన్ని చూసేసరికి, అతని బాధని ఊహించేసరికి కృష్ణకి కళ్లంట జలజలా నీళ్లు కారాయి. ఒక్కసారిగా అతనిలోని మానవత్వం మేలుకొని నీ మిత్రుని కుటుంబం కూలిపోకుండా సహాయపడు అంది తీవ్రంగా అతని అంతరాత్మ.

పర్సు తియ్యబోతోంటే వద్దని వారించింది తన కుటుంబ పరిస్థితి.

మనస్సు ముందుకి చెయ్యి వెనక్కి పీకుతోంటే కొన్ని క్షణాలు నిల్చుండి పోయాడు అల్లాగే కృష్ణ. తన స్థితి కూడా యెప్పటికైనా ఇల్లా వస్తే డబ్బు దాచుకో వద్దా?...అనే ఆలోచనలో పడ్డాడు కృష్ణ-

అంతలో డాక్టరు వచ్చి 'డబ్బు తెచ్చారా? త్వరగా రక్తం ఎక్కిస్తే ఈమె తప్పక జీవిస్తుంది' అంది లేడీ డాక్టర్-

డాక్టర్ వస్తూంటే నల్గురు పిల్లలూ కృష్ణనీ వాసునీ పట్టుకు నిల్చున్నారు. ఒక్కసారిగా ఆ పిల్లల్నీ తండ్రినీ చూచే సరికి కృష్ణ హృదయం ద్రవించిపోయింది.

'ఇదుగోరా వాసూ! ఈ యాభైతో నీ భార్యకి... ఈ పాతిక నీ దగ్గరుంచుకు పిల్లలకి తృప్తిగా ఏదైనా పెట్టించు.' అనేసి చెమ్మగిల్లిన కళ్లతో బయటికి వచ్చాడు కృష్ణ.

తన ఉద్యమానికి ఆశాభంగం అయిందనే చింతతో ఇల్లుచేరాడు నెమ్మదిగా కృష్ణ.




SEENU & CO., 28.K. TANDAVARAYA GRAMANI ST. MADRAS-21.
GRAMS: "ORCAS" (ESTD 1946) PHONE 55357.
BRANCH: SINGAPORE-8 (CEYLON) AGENTS: N.C.M. STORES 82, MAIN ST. COLOMBO-11.
(ADVT. PERMITTED UNDER G.O. MS. NO 1121. HEALTH.)